విత్తన, పురుగుల మందుల షాపుల్లో తనిఖీలు

తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

వరంగల్ చౌరస్తా/నల్లబెల్లి, జూన్ 9 : వరంగల్ స్టేషన్ రోడ్డులోని పలు విత్తన, పురుగుల మందుల షాపుల్లో అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఇందిరా సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్‌లో నిర్వహించిన తనిఖీల్లో ప్రిన్సిపల్ సర్టిఫికెట్స్(పీసీ) అందుబాటులో లేని కారణంగా రూ.1.12కోట్ల విలువైన పురుగుల మందుల అమ్మకాలను నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు వ్యవసాయశాఖ అధికారి రవీందర్ తెలిపారు. తనిఖీల్లో డీఎస్పీ మల్లయ్య, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్, తహసీల్దార్ ఏవీ భాస్కర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. అలాగే, నల్లబెల్లి మండలంలోని కొండైల్‌పల్లె, రుద్రగూడెం, గోవిందాపూర్, కొండాపూర్, పంతులుపల్లె, మూడుచెక్కలపల్లె గ్రామాలను వ్యవసాయఅధికారులు సందర్శించి, కల్తీ విత్తనాల విక్రయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఏవో రజిత మాట్లాడుతూ హెచ్‌టీ బీటీ 3 పత్తి విత్తనాలను విక్రయించడం నేరమని, అలాగే రైతులు సైతం వీటిని ఎట్టి పరిస్థితుల్లో సాగుచేయవద్దని తెలిపారు. డీలర్లు విత్తనాలను అధిక ధరకు విక్రయిస్తే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో నర్సంపేట ఏవో కృష్ణకుమార్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఉపాధ్యాయుడి అసభ్యకర మెసేజ్‌లు

ఓ పాఠశాల ఎదుట తల్లిదండ్రుల ఆందోళన

పోచమ్మమైదాన్, జూన్ 9: పిల్లలకు చదువు చెప్పాల్సిన ఓ ఉపాధ్యాయుడు బాలికలను వాట్సాప్ మెసేజ్‌ల పంపుతూ వేధిస్తున్నాడని ఆరోపిస్తూ కొందరు తల్లిదండ్రులు నగరంలోని ఓ కార్పొరేట్ స్కూల్ వద్ద సోమవారం ఆందోళనకు దిగారు. గత విద్యాసంవత్సరంలో వరంగల్ నర్సంపేట రోడ్డులోని ఓ స్కూల్‌లో పదో తరగతి పూర్తి చేసిన కొందరు విద్యార్థినులకు క్రాంతికుమార్ అనే తెలుగు టీచర్ అసభ్యంగా సందేశాలు పంపుతూ ఇబ్బంది పెడుతున్నాడని, అతడిపై కేసు నమోదు చేసి, చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పలు సంఘాల నాయకులు కోరారు. కాగా తల్లిదండ్రులు ఆందోళన చేస్తున్న సమయంలో హెచ్ఎం అందుబాటులో లేరని, స్కూల్‌కు తాళం వేసి ఉంచారని సంఘాల నాయకులు చెప్పారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు పాఠశాల వద్దకు చేరుకొని వివరాలు ఆరా తీశారు. అయితే సదరు ఉపాధ్యాయుడు తమ పాఠశాలలో పనిచేయడం లేదని, ఏప్రిల్ నెలలోనే రాజీనామా చేసి వెళ్లాడని హెడ్‌మాస్టర్ తెలిపారు.

బైక్ అదుపు తప్పి ఇద్దరికి తీవ్ర గాయాలు

పర్వతగిరి, జూన్ 9 : మండలంలోని ఏనుగల్లు గ్రామంలో సోమవారం బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొని ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. ఏనుగల్లుకు చెందిన పైండ్ల సంపత్, కల్లపు రాకేశ్ అంబేద్కర్ సెంటర్ వైపు వెళ్తుండగా అదుపు తప్పి కింద పడి అపస్మారక స్థితిలో ఉండగా చికిత్స కోసం స్థానికులు దవాఖానకు తరలించారు.

బరాత్‌లో లొల్లి.. పెళ్లికొడుకుపై దాడి

వర్ధన్నపేట, జూన్ 9 : పెళ్లి బరాత్‌లో అమ్మాయి బంధువులు పెళ్లికొడుకుపై దాడి చేసిన ఘటన మండలంలోని బండౌతాపురం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఓ యువకుడు తన ఇంటి సమీపంలోని అమ్మాయిని ప్రేమించాడు. అమ్మాయి కూడా వారి తల్లిదండ్రులను ఒప్పించడంతో ఆదివారం అమ్మాయి ఇంటి వద్ద వివాహం జరిపించారు. రాత్రి బరాత్ జరుగుతున్న క్రమంలో డీజే పాటల విషయంలో పెళ్లి కొడుకు, పెళ్లి కూతురు బంధువుల మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో అమ్మాయి బంధువులు పెళ్లి కొడుకుపై దాడి చేశారు. సోమవారం పెళ్లి కొడుకు కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

సూచనలు ఇస్తున్న ఏసీపీ రవీందర్‌రెడ్డి

నర్సంపేట, జూన్ 9 : శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని నర్సంపేట ఏసీపీ పున్నం రవిందర్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో అనుమానితుల మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టానికి లోబడి నడుచుకోవాలన్నారు. నేరాలకు ఎవరు పాల్పడినా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే, పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. క్రైం వివరాలు, కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నర్సంపేట టౌన్ సీఐ లేతాకుల రఘుపతిరెడ్డి, ఎస్సైలు గూడ అరుణ్‌కుమార్, రవికుమార్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలి

గీసుగొండ/నల్లబెల్లి, జూన్ 9 : సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు అన్నారు. సోమవారం గీసుగొండలోని పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యులు సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సీజనల్ రోగాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పల్లె దవాఖానలో వైద్యులు నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. సీహెచ్‌సీ వైద్యులు రాజు పాల్గొన్నారు. అలాగే, నల్లబెల్లి మండలం లెంకాలపల్లిలో హెల్త్ క్యాంపు నిర్వహించారు. వైద్యాధికారి జయపాల్‌రెడ్డి వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారులు కోమల, హెబ్సిబా, కిషన్ పాల్గొన్నారు.

సీకేఎం దవాఖాన సేవలు మరింత మెరుగుపడాలి

- కలెక్టర్ సత్యశారద
- డైట్ నిర్వహణపై అసంతృప్తి

వరంగల్ చౌరస్తా : దవాఖానలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

వరంగల్ చౌరస్తా, జూన్ 9 : సీకేఎం దవాఖానలో సేవలు, మౌలిక వసతులు మరింత మెరుగుపరచాలని వైద్యాధికారులను కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం దవాఖానను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ రిజిస్ట్రేషన్ కౌంటర్ నిర్మాణం పనులు, శానిటేషన్ నిర్వహణ పనుల్లో వేగం పెంచాలని, పరిసరాల పరిశుభ్రత మెరుగు పరచాలని ఆదేశించారు. సాధారణ ప్రసవాలను పెంచడానికి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. శస్త్రచికిత్సల నిర్వహణ మెరుగు పరచుకోవాలన్నారు. ఐసీయూ విభాగంలో చికిత్స పొందుతున్న మహిళలకు అందిస్తున్న డైట్‌ని పరిశీలించారు. ఆరోగ్య స్థితికి అనుగుణంగా బాలింతలకు అందించాల్సిన పౌష్టికాహారంలో సరైన విధానాలను పాటించకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డైటీషియన్ బదిలీని ఆసరాగా చేసుకొని ఇష్టారీతిన వ్యవహరిస్తున్న డైట్ నిర్వాహణ సంస్థ తీరుపై మండిపడ్డారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన డైటీషియన్ డాక్టర్ సత్యదేవ్, వార్డు ఇన్‌చార్జి స్టాఫ్ నర్స్ సీహెచ్ ఈశ్వరితో పాటు డైట్ కాంట్రాక్టర్ శ్రీనివాస్‌కు సైతం మెమోలు జారీ చేయాలని, రోగుల నుంచి నగదు వసూళ్లకు పాల్పడుతున్న సిబ్బంది విషయంలో కఠినంగా వ్యవహరించాలని వైద్యాధికారులను ఆదేశించారు. సాయంత్రం హాస్పిటల్ అవసరాలపై చర్చించడానికి సూపరింటెండెంట్, ఆర్ఎంవో, డైటీషియన్, పలు విభాగాధిపతులు కలెక్టరేట్‌కు రావాలని ఆదేశించారు. అనంతరం పారా మెడికల్ టెస్టుల విషయంలో నిర్లక్ష్యం వహించడం సరికాదని, వెంటనే పూర్తిస్థాయి పరీక్షలు నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. నవజాత శిశువుల వార్డును పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. హాస్పిటల్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా స్వశక్తి క్యాంటీన్‌ను పరిశీలించారు. కలెక్టర్ వెంట హాస్పిటల్ ఆర్ఎంవో డాక్టర్ మురళి, వైద్యాధికారులు, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

రేషన్ షాపులో టోకెన్ సిస్టం పెట్టాలి

ఖిలావరంగల్ : రేషన్ షాపుల్లో రద్దీ ఉన్న చోట టోకెన్ సిస్టం అమలు చేయాలని కలెక్టర్ సత్య శారద సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సివిల్ సప్లయ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వేసవి తాపాన్ని దృష్టిలో పెట్టుకొని రేషన్ షాపుల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అలాగే సర్వర్ డౌన్ అయితే, నెట్ స్పీడ్ పెంచుకొని త్వరగా పనిచేసలా చూడాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 509 రేషన్ షాపుల్లో 8349 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం సరఫరా చేసినట్లు తెలిపారు. ఇంకా 6411 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. సమావేశంలో డీసీఎస్‌వో కిష్టయ్య, సివిల్ సప్లయ్ డీఎం సంధ్యారాణి పాల్గొన్నారు. కాగా, హైదరాబాద్ నుంచి మంత్రి ధనసరి అనసూయ, సీఎస్ కే రామకృష్ణారావు బడిబాట, ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా వరంగల్ కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. జిల్లాలో పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసే యూనిఫాంల స్టిచ్చింగ్ పూర్తయినట్లు తెలిపారు. 34,878 మంది విదార్థులకు యూనిఫాంలు పంచేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. అలాగే ఇందిరా మహిళా శక్తి స్వయం సహాయక బృందాల ద్వారా జిల్లాలోని నర్సంపేట, వరంగల్‌లో అనువైన ప్రాంతాల్లో పెట్రోల్ బంక్‌లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ జీ సంధ్యారాణి, డీఆర్డీవో కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో రాంరెడ్డి పాల్గొన్నారు.

ఎంజీఎం ఆవరణలో గుర్తు తెలియని ఇద్దరి మృతి

వరంగల్ చౌరస్తా, జూన్ 9 : ఎంజీఎం హాస్పిటల్ ఆవరణలో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. సోమవారం ఎంజీఎం దవాఖాన ఆవరణలో వేర్వేరు చోట్ల కదలకుండా పడి ఉన్న ఇద్దరిని సెక్యూరిటీ సిబ్బంది పరిశీలించి, వారు మృతి చెందినట్లు గుర్తించారు. ఔట్‌పోస్టు సిబ్బంది ద్వారా మట్టెవాడ పోలీసులకు సమాచారం అందించారు. మృతులు సుమారు 55 నుంచి 60 ఏళ్ల మధ్య ఉంటారని పేర్కొన్నారు. మృతదేహాలను ఎంజీఎంహెచ్ మార్చురీలో భద్రపరిచామని, వివరాలకు మట్టెవాడ పోలీస్ స్టేషన్ 7812685005 నంబర్‌లో సంప్రదించాలని సీఐ గోపీ సూచించారు.

రైలు నుంచి కింద పడి ఒకరు..

ఖిలావరంగల్, జూన్ 9 : రైలు నుంచి కిందపడి గుర్తు తెలియని ప్రయాణికుడు మృతి చెందిన ఘటన ఇంటికన్నె, కేసముద్రం రైల్వేస్టేషన్ల మధ్య జరిగింది. వరంగల్ జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ ఎస్ రవీందర్‌రెడ్డి కథనం ప్రకారం. సుమారు 45 ఏళ్ల వయసు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి రైలులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. అతడు క్రీమ్ కలర్ షార్ట్, నేవీ బ్లూ కలర్ టీషర్ట్ ధరించి ఉన్నాడు. మృతుడి వద్ద దానాపూర్ నుంచి పెరంబూర్‌కు వెయిటింగ్ లిస్ట్ టికెట్ తప్పా ఎలాంటి ఆధారాలు లభించలేదు. రైల్వే అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని ఎంజీఎం దవాఖాన మార్చూరీలో భద్రపరిచారు.

విద్యుదాఘాతంతో మేక..

నర్సంపేట, జూన్ 9 : విద్యుదాఘాతంతో మేక మృతి చెందిన ఘటన మండలంలోని రామవరంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన జినుకల నరేందర్ మేకను గ్రామ శివారుకు మేతకు తీసుకెళ్లాడు. విద్యుత్ స్తంభం వద్ద షాక్‌కు గురై మేక మృతి చెందింది. దీని విలువ రూ.15వేల వరకు ఉంటుందని బాధితుడు నరేందర్ తెలిపాడు.

షార్ట్ సర్క్యూట్‌తో షెడ్డు దగ్ధం

చెన్నారావుపేట, జూన్ 9 : షార్ట్ సర్క్యూట్‌తో పశువుల షెడ్డు కాలి బూడిదైన ఘటన చెన్నారావుపేట మండలం జల్లి గ్రామంలో సామవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కాట కుమారస్వామి పశువులను పెంచుతూ పాల వ్యాపారం చేస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం లేడ దూడలను షెడ్డులో కట్టేసి ఆవులను మేతకు తీసుకువెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి పరదాలు అంటుకోవడంతో స్థానికులు దూడలను విడిచిపెట్టి, మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే షెడ్డు పూర్తిగా కాలిపోయింది. రూ.లక్ష వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు కాట కుమారస్వామి వాపోయాడు.

బల్దియా గ్రీవెన్స్ వినతులపై నిర్లక్ష్యం

వరంగల్, జూన్ 9 : బల్దియా గ్రీవెన్స్‌లో వినతులను పట్టించుకోకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించిన ఫిర్యాదులపై అధికారులు స్పందించడం లేదని ఆరోపించారు. కార్పొరేషన్ స్థలం కబ్జా అవుతుందని పలుమార్లు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలోని మేయర్ కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులు గ్రీవెన్స్ నిర్వహించారు. 30వ డివిజన్ పరిధి ఏషియన్ మాల్ వెనుక భాగంలోని 1081 సర్వే నంబర్‌లో సుమారు 570 గజాల మున్సిపల్ స్థలాన్ని కబ్జా చేసి ఏకంగా భవనం నిర్మిస్తున్నారని కార్పొరేటర్ రావుల కోమల-కిషన్ ఫిర్యాదు చేశారు. గతంలో సర్వే చేసిన టౌన్‌ప్లానింగ్ అధికారులు అది ప్రభుత్వ స్థలంగా తేల్చారని తెలిపారు. రూ.కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలని పలుమార్లు గ్రీవెన్స్‌లో విన్నవించినా పట్టించుకోకుండా భవన నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయడం ఏంటని కార్పొరేటర్ నిలదీశారు. వెంటనే అనుమతులు రద్దు చేసి, ప్రహరీ నిర్మించాలని డిమాండ్ చేశారు. గిర్మాజీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో వర్షం పడితే బురదమయంగా మారుతున్నదని, మొరం పోయించాలని హెచ్ఎం వినతిపత్రం అందజేశారు. లక్ష్మీ మెగా టౌన్‌షిప్‌లో విరిగిన విద్యుత్ స్తంభాలను తొలగించాలని స్థానికులు కోరారు. 35వ డివిజన్ పుప్పాలగుట్ట గణపతి నగర్ రోడ్ నంబర్-8లో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మించాలని కాలనీవాసులు విన్నవించారు. పలు డివిజన్లలో కోతులు, కుక్కల బెడద తీవ్రంగా ఉందని బీజేపీ నాయకుడు బాకం హరిశంకర్ ఫిర్యాదు చేశారు. గ్రీవెన్స్‌లో మొత్తం 76 వినతులు వచ్చాయి. టౌన్‌ప్లానింగ్ విభాగానివి 39, ఇంజినీరింగ్ విభాగం 17, ప్రజారోగ్య విభాగం 6, పన్నుల విభాగం 10, తాగునీటి సరఫరావి 4 ఉన్నాయి. అదనపు కమిషనర్ జోనా, సీఎంహెచ్‌వో రాజారెడ్డి, ఇన్‌చార్జి సిటీప్లానర్ రవీందర్ రాడేకర్, ఇన్‌చార్జి ఎస్ఈ శ్రీనివాస్, హార్టికల్చర్ అధికారి రమేశ్ పాల్గొన్నారు.

టౌన్‌ప్లానింగ్ ఫిర్యాదులను పట్టించుకోని అధికారులు

వేర్వేరు ఘటనల్లో పలువురిపై కేసులు

సంగెం, జూన్ 9 : రెండు వేర్వేరు ఘటనల్లో పలువురిపై కేసులు నమోదయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని రాంచంద్రాపురం గ్రామానికి చెందిన చిదిరాల సంపత్ ఇల్లు నిర్మించుకుంటుండగా మొరం ఎత్తుగా పోసుకున్నందుకు అతడి సోదరుడు చిదిరాల సుధాకర్ గొడవపడ్డాడు. ఈ మేరకు ఈ నెల 8న సంపత్ కుటుంబ సభ్యులను దూషించాడు. ప్రశ్నించించిన సంపత్‌పై కుటుంబ సభ్యులతో కలిసి సుధాకర్ దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సుధాకర్, భాగ్యమ్మ, ప్రవీణ్, అఖిల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. అలాగే, మండలంలోని లోహిత గ్రామానికి చెందిన బొడ్డుపెల్లి వెంకట్రాజ్యం అతడి బాబాయి బొడ్డుపెల్లి కొమురయ్య మధ్య ఇంటికి వెళ్లే బాట విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 8న సాయంత్రం తమ ఇంటి ముందు నుంచి నడవొద్దు అంటూ బొడ్డుపెల్లి వెంకట్రాజ్యం అతడి కుటుంబాన్ని కొమురయ్యతోపాటు కుటుంబసభ్యులు కర్రలతో కొట్టి గాయపరిచారు. వెంకట్రాజ్యం ఫిర్యాదు మేరకు బొడ్డుపెల్లి కొమురయ్య, సమ్మక్క, సంతోశ్, ప్రశాంత్, రాణిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తూర్పు తండాలో..

పర్వతగిరి : మండలంలోని తూర్పు తండాలో ఇద్దరు మహిళలపై దాడి చేసిన ఘటనలో ముగ్గురిపై కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. ఏనుగల్లు శివారు తూర్పు తండా గ్రామానికి చెందిన బానోత్ వినోద తనకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని ఇండ్ల ఇన్‌చార్జి బానోత్ యుగేందర్‌ను రెండు రోజుల క్రితం కోరింది. అయితే, యుగేందర్ ఆమెకు ఇల్లు రాలేదని, రానివ్వకుండా చేస్తానని దురుసుగా మాట్లాడగా వినోద కూతురు వసంత ఫోన్‌లో రికార్డు చేసింది. దీన్ని మనసులో పెట్టుకొన్న యుగేంధర్ ఆదివారం సాయంత్రం వినోద, వసంత బోరింగ్ వద్ద నీళ్లు పట్టుకొని వస్తుండగా తన భార్య ఈరి, తల్లి సీతమ్మతో కలిసి వారి కళ్లల్లో కారం చల్లి, దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నేడు విద్యుత్ సదస్సు

దుగ్గొండి, జూన్ 9 : మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో మంగళవారం వినియోగదారుల సదస్సు నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ రామ్మూర్తి తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అధికారులకు సమస్యలపై నేరుగా ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు మార్చడం, వోల్టేజీ హెచ్చుతగ్గులు, మీటర్లు మార్చడం, నూతన సర్వీసు మంజూరు, అధిక బిల్లుల సమస్య, సర్వీస్ పేరు మార్పు తదితర సమస్యలపై ఈ లోకల్ కోర్టును ఏర్పాటు చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు సరఫరాలో అంతరాయం

హనుమకొండ, జూన్ 9 : వరంగల్ టౌన్ పరిధిలో పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్ ఆపరేషన్ డీఈ ఎస్ మల్లికార్జున్ ఒక ప్రకటనలో తెలిపారు. మెయింటనెన్స్ పనుల్లో భాగంగా ఉదయం 9 నుంచి 12 గంటల వరకు కుమ్మరివాడ, రామాలయం, మహాంకాళి, నాగమయ్య, జడల రాంచంద్రన్, గడి ఏరియాలు, ముసలమ్మకుంట, ఎనుమాముల ఇండస్ట్రీస్, ఉర్సు, జన్మభూమి జంక్షన్, కామునిపేట ఎస్సీ కాలనీ, దేశాయిపేట బొడ్రాయి, సీకేఎం కాలేజీ, లక్ష్మి టౌన్‌షిప్, రంగనాయక టెంపుల్, గ్రీన్‌సిటీ, దేశాయిపేట, గొర్రెకుంట ఇండస్ట్రియల్, జాన్‌పాక ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని సోమవారం ఒక ప్రకటనలో కోరారు.

సమన్వయంతో విద్యాభివృద్ధికి కృషి చేయాలి

- బడిబాటలో కలెక్టర్ సత్యశారద
- కొనసాగుతున్న కార్యక్రమాలు

నల్లబెల్లి/సంగెం/నర్సంపేట/వర్ధన్నపేట/చెన్నారావుపేట/ఖానాపురం/దుగ్గొండి/రాయపర్తి/ గీసుగొండ/గిర్మాజీపేట/ఖిలావరంగల్/పోచమ్మమైదాన్, జూన్ 9 : ఉపాధ్యాయులు సమన్వయంతో విధులు నిర్వర్తిస్తూ విద్యాభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఆదేశించారు. సోమవారం మండలంలోని కన్నారావుపేట, నందిగామ గ్రామాల్లో నిర్వహించిన బడిబాట కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. నందిగామ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలను సందర్శించారు. అక్కడ ఉపాధ్యాయులు సమన్వయంతో విధులు నిర్వర్తించక పోవడాన్ని కలెక్టర్ గుర్తించి నిబంధనలు పాటించని ఉపాధ్యాయులను ఉపేక్షించబోమని హెచ్చరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని సూచించారు. కన్నారావుపేట ఎంపీపీఎస్‌కు ప్రహరీ నిర్మాణానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. కాగా, సంగెం మండలంలోని మొండ్రాయి జడ్పీ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో జరిగిన బడిబాట ర్యాలీలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు. పాఠశాలలో పదో తరగతి మండల టాపర్‌గా నిలిచిన అజ్మీరా దీపికకు రూ.4వేలు అందజేశారు. నర్సంపేట మండలంలోని చంద్రయ్యపల్లి, భాంజీపేట, కమ్మపల్లి, మహేశ్వరం, లక్నెపల్లి, గురిజాల, ముగ్ధంపురం, ముత్తోజిపేట, ఇటుకాలపల్లి గ్రామాల్లో ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్లి బడిబయట ఉన్న విద్యార్థుల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఈవో సారయ్య పరిశీలించారు. పట్టణంలోని రామాలయం ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం శోభ, 14వ వార్డు ఆఫీసర్ లావణ్య, ఏఎన్ఎం కవిత, అంగన్‌వాడీ టీచర్ కవిత పాల్గొన్నారు. వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద, వర్ధన్నపేటలో జరిగిన బడిబాట ర్యాలీలు, సదస్సుల్లో తహసీల్దార్ విజయ్‌సాగర్, ఎంపీడీవో వెంకటరమణ పాల్గొన్నారు. చెన్నారావుపేట మండలం జల్లిలోని రైతు వేదికలో విద్యార్థుల తల్లిదండ్రులతో ఎంపీడీవో శ్రీవాణి, తహసీల్దార్ ఫణికుమార్ సమావేశం నిర్వహించారు. ఎంఈవో సరళ జోజిపేట నారాయణతండాలో బడిబాట నిర్వహించారు. ఖానాపురంలో జరిగిన సమావేశంలో ఎంపీడీవో సునీల్ రాజ్‌కుమార్, ఎంఈవో శ్రీదేవి పాల్గొన్నారు. దుగ్గొండి మండలం గుడిమహేశ్వరం, వెంకటాపురం, లక్ష్మీపురం, బంధంపల్లి, దేశాయిపల్లి, కేశవపురం, తోగర్రామయ్యపల్లి గ్రామాల్లో హెచ్ఎం రామస్వామి తదితరులు పాల్గొన్నారు. రాయపర్తి మండలంలోని గట్టికల్‌లో ఎంపీపీఎస్ హెచ్ఎం నెల్లుట్ల నర్సింహారావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. గ్రేటర్ 16వ డివిజన్ ధర్మారం జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో గీసుగొండ ఎంపీడీవో కృష్ణవేణి, ఎంఈవో సాంబయ్య పాల్గొన్నారు. 25వ డివిజన్ పరిధిలోని నిజాంపుర, ఇంతెజార్‌గంజ్ పాఠశాలల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమాన్ని కార్పొరేటర్ బస్వరాజ్ శిరీష ప్రారంభించారు. 24వ డివిజన్ పరిధి మట్టెవాడ ప్రాథమిక పాఠశాలలో కార్పొరేటర్ ఆకుతోట శిరీష, లక్ష్మీపురంలో 26వ డివిజన్ కార్పొరేటర్ బాలిన సురేశ్ ప్రారంభించారు. శివనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలో బడిబాట నిర్వహించారు. దేశాయిపేట, ఎల్‌బీనగర్, కొత్తవాడలో వరంగల్ ఎంఈవో గంప అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో రేషన్ షాపుల వద్ద విద్యార్థుల తల్లిదండ్రులకు కరపత్రాలు అందజేశారు.

సంగెం : మొండ్రాయిలో బడిబాట ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

రాయపర్తి : గట్టికల్ బడిబాట గ్రామ సభలో మాట్లాడుతున్న హెచ్ఎం నెల్లుట్ల నర్సింహారావు

పోచమ్మమైదాన్ : రేషన్‌షాపు వద్ద తల్లిదండ్రులకు కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎంఈవో అశోక్‌కుమార్

వెలిగిన వీధిలైట్లు

'నమస్తే' ఎఫెక్ట్

బూర కనకయ్య కాలనీలో వెలిగిన వీధిలైట్లు

పోచమ్మమైదాన్, జూన్ 9 : వరంగల్ 12వ డివిజన్ బూర కనకయ్య కాలనీ, వీవర్స్‌కాలనీలో సోమవారం రాత్రి వీధిలైట్లు వెలిగాయి. 'వెలగని వీధిలైట్లతో కాలనీవాసుల ఇబ్బందులు' శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో సోమవారం కథనం ప్రచురితమైంది. దీంతో విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి, ఆయా ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలకు లైట్లను ఏర్పాటు చేయించి, వెలిగించారు. ఈ నేపథ్యంలో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు. త్వరగా తమ సమస్యను పరిష్కరించేందుకు సహకరించిన 'నమస్తే తెలంగాణ'కు, విద్యుత్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి

నల్లబెల్లి/రాయపర్తి, జూన్ 9 : రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ డాక్టర్ సత్యశారద అన్నారు. నల్లబెల్లి మండలంలోని కన్నారావుపేట, నందిగామ గ్రామాల్లో జరిగిన భూభారతి రెవెన్యూ సదస్సులను ఆమె సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కన్నారావుపేట